

# తండ్రి గారి సందేశం....

## "క్రైస్తవునికి, క్రీస్తుకు మధ్య సన్నిహిత సంబంధం"

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

సెప్టెంబర్ 8వ తేదీన మరియతల్లి జన్మదిన మహోత్సవాన్ని మనం ఘనంగా జరుపుకుంటున్నాము. ఈ మహోత్సవం సందర్భంగా మరియతల్లి గురించి మనం ధ్యానించుకుందాం.

ఒకనాడు, యేసు ప్రభు కఫర్నాము పట్టణంలో బోధించుచుండగా ఆయన తల్లి మరియు సోదరులు ఆయనను చూడటానికి రాగా యేసు ప్రభు ఆ విషయాన్ని తెలుసుకొని "నా తల్లి యెవరు? నా సోదరీ, సోదరులెవరు?" అని ప్రశ్నించాడు. యేసు ప్రభు ఈ విధంగా స్పందించటం మనకందరికి ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కాని ఈ వాక్యాన్ని లోతుగా పరిశీలించినట్లయితే దానిలోని అంతరార్థాన్ని మనం గ్రహించవచ్చు. యేసు ప్రభు ఈ ప్రశ్న అడిగిన తరువాత దానికి జవాబును కూడా ఆయనే ఇస్తున్నారు. తన చుట్టునున్న జనులను చూచి "ఇదిగో! వీరే నా తల్లి, నా సోదరులు. ఏలన, దేవుని చిత్తమును నెరవేర్చు వాడే నా సోదరుడు, నా సోదరి, నా తల్లి అని పలికెను". (మార్కు 3,34-35)

యేసు ప్రభు రక్త సంబంధం కంటే ఇంకా గొప్పదైన సంబంధం గురించి ఇక్కడ వివరిస్తున్నారు. ఈ ప్రత్యేక బంధంలో రెండు ప్రాముఖ్యతలున్నాయి. 1. యేసు ప్రభుతో పాటు ఉండడం. 2. దేవుని చిత్తాన్ని నెరవేర్చడం. యేసు ప్రభుతో పాటు ఉండడం అంటే ఆయన శిష్యునిగా లేదా శిష్యురాలిగా మారటం. కాని అంతటితో ఆ బంధం పరిపూర్ణం కాదు. దేవుని చిత్తాన్ని నెరవేరుస్తూ జీవించడమే అందులోని ముఖ్యాంశం. దేవుని చిత్తాన్ని జీవితాంతం నెరవేర్చాలని యేసు ప్రభుని సోదరి, సోదరులుగా మారాలనుకున్న వారందరు గుర్తుంచుకోవలసిన ప్రాముఖ్యమైన విషయం. ఇదే విషయాన్ని యేసు ప్రభు లూకా సువార్తలో కూడా ప్రస్తావిస్తున్నారు. "దేవుని వాక్కును ఆలకించి, పాటించు వారే నా తల్లి, నా సోదరులు" (లూకా 8,21). జనసమూహములో ఒక స్త్రీ "నిన్ను మోసిన గర్భమును, నీకు పాలిచ్చిన స్తనములును ధన్యమైనవి" అని ఎలుగెత్తి పలికెను. అందుకు యేసు "దేవుని వాక్కు ఆలకించి దానిని పాటించువారు మరింత ధన్యులు" అనెను. (లూకా 11, 27-28)

యేసు ప్రభుని శిష్యత్వంలో ముఖ్యమైనవి 1. దేవుని వాక్యాన్ని హృదయ పూర్వకంగా స్వీకరించటం, 2. దేవుని వాక్యాన్ని ధ్యానించటం, 3. ఆ వాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని జీవించటం. క్లుప్తంగా చెప్పాలంటే దేవుని వాక్యం అనుసరించి జీవించాలి. యేసు ప్రభుని తల్లియైన మరియమ్మ కూడా ఈ విధంగా జీవించింది. దేవుని వాక్యాన్ని అనుసరించి మాత్రమే ఆమె తన జీవితాన్ని కొనసాగించింది. గాబ్రియేలు దేవదూత అందించిన దేవుని వాక్యాన్ని ఆమె మనస్ఫూర్తిగా

స్వీకరించింది. అంతట మరియమ్మ "ఇదిగో నేను ప్రభువు దాసిరాలను. నీ మాట చొప్పున నాకు జరుగు గాక!" అనెను" (లూకా 1,38). "ప్రభువు పల్కిన వాక్కులు నెరవేరునని విశ్వసించిన నీ వెంత ధన్యురాలవు!" (లూకా 1,45). దేవుని మాటలను ఆలకించి విశ్వసించినందులకు మరియమ్మ ధన్యురాలుగా పిలువబడింది. మరియతల్లి తన జీవితాంతం దేవుని చిత్తానికి లోబడి జీవించింది.

యేసు ప్రభు స్థాపించిన ఈ బంధం ఎంతో ఉన్నతమైంది. రక్త సంబంధం కంటే ఉన్నతమైనది. దేవుని వాక్యాన్ని పఠించి, పాటించు వారందరు యేసు ప్రభు కుటుంబ సభ్యులే. యేసు ప్రభు పునరుత్థానం అయిన తరువాత ఆయన తన శిష్యులను సోదరులు అని పిలుస్తున్నారు. "నీవు వెళ్లి నా సోదరులతో ఇట్లు చెప్పుము" (యోహాను 20,17). ఆ విధంగా యేసు ప్రభు చిత్తాన్ని పాటించు వారందరు ఒకే కుటుంబంలోని సభ్యులని యేసు ప్రభు వివరిస్తున్నారు.

ప్రియ సహోదరి, సహోదరులారా మనమందరం దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి ఉత్సాహం చూపుదాం. మన జీవితంలో మనకు మంచిది అనిపించే దాని కన్నా మనకు సంతోషాన్ని కలిగించే దాని కన్నా ముఖ్యమైంది దేవుని చిత్తాన్ని నెరవేర్చటం అని గ్రహిద్దాం. "నీ చిత్తము పరలోకమందు నెరవేరునట్లు భూలోకమందు నెరవేరును గాక!" (మత్తయి 6,10) అని పరలోక ప్రార్థనలో యేసు ప్రభు ఈ విషయాన్ని మనకు నేర్పిస్తున్నాడు. "ప్రభూ! ప్రభూ! అని నన్ను సంబోధించు ప్రతివాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు. కాని, పరలోకమందలి నా తండ్రి చిత్తానుసారముగా వర్తించువాడే పరలోక రాజ్యమున ప్రవేశించును" (మత్తయి 7,21) అని యేసు ప్రభు చాలా స్పష్టంగా తెలియజేస్తున్నాడు.

మరియతల్లి యేసు ప్రభుకు శారీరకంగా జన్మనిచ్చిందుకు తల్లి అయినది మనందరికి తెలుసు. అంతేగాక, దేవుని చిత్తాన్ని నెరవేర్చినందుకు ఆమె యేసు ప్రభుకు తల్లి అయినది. "దేవుని చిత్తమును నెరవేర్చు వాడే నా సోదరుడు, నా సోదరి, నా తల్లి అని పలికెను" (మార్కు 3,34-35) అని చెప్పటం ద్వారా యేసు ప్రభు మరియతల్లి ఔన్నత్యాన్ని వివరిస్తున్నాడు. కానా పల్లె పెళ్లి విందులో మరియ తల్లి సేవకులతో "ఆయన చెప్పినట్లు చేయుడు" (యోహాను 2,5) అన్న విధంగా ఆ తల్లి మనం కూడా యేసు ప్రభు చెప్పినట్లు జీవించాలని కోరుకుంటుంది. దేవుని చిత్తాన్ని పాటించడంలో మరియ తల్లి మనందరికి మాతృక.

దేవుని చిత్తాన్ని పాటించుకుంటూ మనం ముందుకు సాగుదాం. దేవుని చిత్తానికి ప్రాధాన్యం ఇచ్చి ఆధ్యాత్మికతలో ఎదుగుదాం. ఆ విధంగా మనమందరం యేసు ప్రభుని సోదరీ, సోదరులము అవుదాము. మరియతల్లి ప్రార్థన సహాయం మనందరికి తోడ్పడును గాక.దేవుడు మనలందరిని దీవించును గాక!

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు